: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 45 | 15-08-2022 | పుటలు : 4









## నన్నయలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### స్వాతంత్ర్య స్ఫూర్తితో అభివృద్ధికై పాటుపడదాం
### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**15.08.22 (మీడియాసెల్)**
ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధి, విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడదామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా

- తరువాయి 4లో..

## 75 వ భారత స్వాతంత్ర్యదిన అమృతోత్సవ శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

## నన్నయలో జాతీయ జెండాలతో ర్యాలీ




**12.08.22 (మీడియాసెల్)**
ఆజాద్ కా అమృత్ మహెూత్సవ్ మరియు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ జెండాలతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓఎస్డి ఆచార్య ఎస్.టేకి హాజరై జాతీయ జెండాకు నమస్కరించి ర్యాలీని ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎంపిఈడి మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తూ ర్యాలీని కొనసాగించారు. ర్యాలీ అనంతరం విశ్వవిద్యాలయ చాళుక్య ద్వారం వద్ద రిజిస్ట్రార్ ఆచార్య అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు దేశభక్తి సంబంధిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభను కనబరుస్తున్నారని తెలియజేశారు. ఆచార్య టేకి మాట్లాడుతూ వీసీ జగన్నాథరావు సూచనమేరకు క్రీడలు దేశభక్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు వంటి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయులను స్మరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నన్నయలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలు



2 లో..

## నన్నయలో ఆకట్టుకున్న 'తిరంగా చిత్రాను'

**13.08.22 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తిరంగా చిత్రాను' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. దేశభక్తి, స్వాతంత్ర్య ఉద్యమం, మన జాతీయ జెండా అనే అంశాలపై యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు చక్కని చిత్రాలతో పోస్టర్లను సిద్ధం చేశారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ ఆవరణలో ప్రదర్శించిన ఈ పోస్టర్ లు అందరిని ఆకట్టుకున్నాయి. వీటిని పరిశీలించిన ఓఎస్డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా వి. పెర్సిస్ వివరాలను తెలియజేసారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత మహెూత్సవ్ మరియు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా వీసీ ఆచార్య మొక్కా

- తరువాయి 2లో..



# సంపాదకీయం



## మహాత్మా! నిన్ను తలుస్తూ..

ఒక క్రీస్తు రుధిర బిందువు, ఒక బుద్ధుని అభయ ముద్ర, ఒక రుషి పీఠం, ఒక శాంతి మంత్ర పాఠం.. సకలముకలసి గాంధీ జన్మమునెత్తె... అంటారు శ్రీ గరికిపాటి సాగర ఘోష కావ్యంలో.

స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ ప్రవేశం ఒక కాంతిరేఖ. హరిజనోద్ధరణ, వ్యసన నిర్మూలన, స్త్రీ జనోద్ధరణ, జాతీయ విద్యా ప్రచారం, స్వదేశీ వస్తువుల మీద అభిమానం, రైతుజన సేవ వంటి సమస్యల్ని తీసుకుని ఉద్యమాలుగా నడిపిన వ్యక్తి గాంధీజీ. ప్రజలు ఆయనతో పాటు నడిచారు. నాయకులు ఆయన వాక్కును మంత్రంగా తీసుకుని ఉద్యమాలు నడిపారు. స్వాతంత్ర్య సమపార్జనలో బాపూజీది ఒక ప్రత్యేకమైన పాత్ర.

ఆయన ఖాదీ మనకు  ఆజాదీ. ఆయన ధ్యేయనిష్ట జాతి స్వాతంత్ర్య పునః ప్రతిష్ట. ఆయన సత్యాగ్రహ సాధన దేశ శాంతి దేవతా సమారాధన. ఆయన కర్తవ్య మహాదీక్ష లోకానికి శ్రీరామరక్ష. ఆయన సర్వమానవ సమాన దృష్టి సత్య అహింసల సమష్టి. ఆయన బోసి నవ్వులు భారతమాత పూజ కోసం కోసి రాసిపోసిన పువ్వులు....

గాంధీజీ జీవితం... అందరూ నడుస్తున్నంత మాత్రాన అది సత్య పథమేనా అని పరీక్షించి చూసిన ప్రయోగం. తను నమ్మిన సిద్ధాంతాలకు పుటం పెట్టి జీవితాన్నే పణంగా పెట్టి నిరూపించిన వ్యక్తిత్వం. అహింస అనే ఆయుధాన్ని ఉపయోగించి ధర్మ యుద్ధంలో గెలిచిన అపూర్వ ఘట్టం. నిరాడంబరమైన జీవితంలో రాచరికాన్ని మించిన సుఖం ఉంటుందని తేల్చిన సందర్భం. సత్యం కోసం హరిశ్చంద్రునిలా, సేవలో శ్రవణకుమారుడిలా మెలగాలనుకున్న ఆదర్శం. అందుకే బాపూజీ జీవితం నిరంతర అధ్యయనాంశం.

ఎన్నేళ్లయినా మహాత్ముడు వార్తల్లో వ్యక్తి. ప్రపంచంలో ఏదో ఒక మూలన ఆ అహింసా మూర్తిని తలచుకుంటూనే ఉంటారు. ఎవరో ఒకరు గాంధీయిజం పట్ల ప్రభావితులవుతూనే ఉంటారు. ఏదో ఒక సమస్యకు గాంధీ సూత్రాల్లో పరిష్కారం లభిస్తూనే ఉంటుంది. మహాత్ముని విమర్శిస్తున్నవారూ ఉన్నారు. ఆ విధంగా కూడా గాంధీజీ ప్రజల మధ్యన చర్చింపబడుతూనే ఉంటారు. ఆయన బోసి నవ్వుల బొమ్మ పంచరంగుల్లో కరెన్సీ నోట్ల మీద రెపరెపలాడుతూనే ఉంటుంది.

గాంధీ బోధనలు ఆధునిక తరాలవారి బుర్రలకు ఎక్కవని, ఈ కాలానికి గాంధేయవాదం పనికిరాదనే వాదనలు చాలానే వినిపిస్తూ ఉంటాయి. కానీ మనం మనిషిగా బతకాలనుకున్నంత కాలం సత్యం, అహింసల విలువ చెక్కుచెదరదు. వాటిని ఆచరించి చూపిన గాంధీజీ బోధనలు వన్నె తరగవు. అందుకు సాక్ష్యంగా ఎంతో మంది ప్రముఖుల జీవితాలు వారు గాంధీజీని ఉటంకించిన అంశాలు మనకు పత్రికల్లో కనిపిస్తూనే ఉంటాయి. గాంధీ మామూలు మనిషి. కానీ చాలామంది తేలికగా తీసుకునే విషయాన్ని ఆయన కచ్చితంగా పాటించారు. క్రమశిక్షణకు, నిజాయితీకి, సత్యానికి కట్టుబడ్డారు. నిరాడంబరతను జీవితంలో భాగం చేసుకున్నారు. తాను మహాత్ముడు అయ్యారు. స్ఫూర్తినిచ్చి ఎంతోమంది మహావ్యక్తులు తయారు కావడానికి కూడా కారణమయ్యారు.

ప్రతి మగవాడి విజయం వెనుక ఒక ఆడది ఉంటుందని చెబుతారు. అలాంటిది ఓ మహాత్ముడి వెనుక ఉన్న స్త్రీ మూర్తి ఎంత మహోన్నతురాలై ఉండాలి. అందుకే ఆమెను ఎరిగిన వారంతా బా (అమ్మ) అనే పిలిచేవారు. ఆమె కస్తూరిబాయి. దక్షిణాఫ్రికాలో అల్పసంఖ్యాకుల హక్కుల కోసం పోరాడినప్పుడు గాంధీకి కస్తూరి ఉద్యమ సహచరిగా మారింది. శాసనోల్లంఘన సమయంలో మహిళలకు నేతృత్వం వహించింది. జైలుకు తరలించిన సందర్భంలో ధైర్యాన్ని నూరిపోసింది.

సందేహాలు వెంటాడినప్పుడు, నిస్పృహ కన్నెర్ర చేసినప్పుడు తనకు స్ఫూర్తిని ప్రసాదించిన భగవద్గీతను ఆయన గురువుగా, చిరంతన జననిగా అభివర్ణించారు.

గాంధీ జయంతి రోజునో,  స్వాతంత్ర్య దినోత్సవం రోజునో మాత్రమే కాకుండా గాంధీ సిద్ధాంతాల్ని నిరంతర అధ్యయనం చేస్తూ ఆచరణల ద్వారా మాత్రమే ఆయనను స్మరించాలి.

# నన్నయలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలు



**11.08.22 (మీడియాసెల్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాల ప్రకారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలలో భాగంగా విశ్వవిద్యాలయ సెమినార్ హాల్ లో వివిధ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సందర్శించిన వీసీ జగన్నాథరావు విద్యార్థులకు శు భాకాంక్షలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో దేశభక్తి గీతాలాపనలు, నృత్యం, నాటకం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే విశ్వ విద్యాలయంలోని ఆయా కళాశాలలు సాంస్కృతిక/దేశభక్తి పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు, మెగా ర్యాలీ కార్యక్రమం, క్రీడలలో పోటీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని పెంపొందించే విధంగా ప్రతిభను చాటుకోవాలని తెలియజేసారు. ఆయా పోటీలలో విజేతలకు 15 వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రోజున బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. అలాగే దేశ భక్తిని ప్రతిబింబించే విధంగా అందరి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అందరూ దేశభక్తితో కార్యక్రమాలను జయప్రదం చేస్తూ భారతదేశ గౌరవాన్ని, ఔనత్యాన్ని భావితరాలను అందించాలని, "హర్ ఘర్ తిరంగా"ను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం సెమినార్ హాల్ లో జరిగిన వివిధ సాంస్కృతిక పోటీలలో అన్ని కళాశాలల నుండి విద్యార్థులు హాజరై దేశభక్తి గీతాలాపనలు, నృత్య ప్రదర్శనలు, నాటకలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, న్యాయనిర్ణేతలు డా.కె.శ్రీరాజరాజేశ్వరిదేవి, డా.ఎం.గోపాలకృష్ణ, డా.సి.హెచ్.భవాని, డా.టి.అనిత, డా.కె.రేవతి, ఎ.ఎం.శిరీష, సిహెచ్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# నన్నయలో ఆకట్టుకున్న 'తిరంగా చిత్రాను'








**(మొదటి పేజీ నుంచి)**
జగన్నాథరావు సూచనమేరకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో తిరంగా చిత్రాను కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ నిర్మాణ్ క్లబ్  విద్యార్థుల సహకారంతో 29 సహజ ఛాయాచిత్రాల ప్రదర్శనలు చేసామన్నారు. ఈవెంట్ కోఆర్డినేటర్ గా జి.నిరంజన్, న్యాయనిర్ణేతగా డా.ఎం.గోపాలకృష్ణ, ఎస్.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు వ్యవహరించారన్నారు. దేశభక్తి కార్యక్రమాల్లో విద్యార్థులు భాగ స్వామ్యం చేసేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో విజయవంతమైందని అందరిని ఆకట్టుకుందని తెలియజేశారు.




# ఏ.యు. వీసీని కలిసిన నన్నయ వీసీ




ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద్ రెడ్డిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయంలో ప్రసాద్ రెడ్డిని కలిసిన జగన్నాథరావు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఇద్దరు వీసీ లు ఆంధ్ర, ఆదికవి విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. నన్నయ విశ్వవిద్యాలయ మాతృ సంస్థ అయిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల కాలంలో సాధించిన అభివృద్ధి అభినందనీయమని జగన్నాథరావు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ మార్గంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ఆచార్య ప్రసాదరెడ్డి అందిస్తారన్నారు.

# ఆన్‌లైన్ అంతర్జాతీయ గిరిజన సదస్సుకు విశేష స్పందన

**09.08.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని ఆన్లైన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఆచార్య మొక్కా జగన్నాథరావు, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య టివి కట్టమణి ఆన్లైన్లో హాజర య్యారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ గిరిజనులు సుస్థిర అభివృద్ధి సాధించాలని అన్నారు. గిరిజనులు ఉన్నత విద్యను అభ్యసించి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. టీవీ కట్టమణి మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం గిరిజన




విద్యార్థులకు ఉన్నత విద్య సవాలు మరియు అవకాశాలు అనే అంశంపై ఉపన్యసించారు. గిరిజనుల ఉన్నత విద్య కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని అన్నారు. తర్వాత 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో గిరిజనులు సాధించిన అభి వృద్ధి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ కార్యక్రమ అధ్యక్షులు డా.పి.విజయ నిర్మల ,రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డా. చప్పిడికృష్ణ , ఓ. ఎస్ .డి ఆచార్య ఎస్ టేకి, ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి, శ్రీనివాసరావు, డా.ఆర్.ఎస్. వరహాల దొర, డా. యామిని జ్యోత్స్న, కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# నన్నయలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఘనంగా జాతీయ గ్రంథా లయదినోత్సవము రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథా లయ దినోత్సవము మరియు ఎస్.ఆర్.రంగనాథన్ 130వ జయంతి ఘనంగా జరిగినది, ఈ ఈ సందర్భంగా ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ ఎస్.ఆర్.రంగనాథన్ భారతదేశ గ్రంథాలయాల అభివృద్ధికి ఏంతో కృషి చేసార ని, గ్రంథాలయ విద్యలో వినూత్న వరవడులు తీసుకువచ్చి పాఠకులకు మరింత చేరువగా విజ్ఞానాన్ని మరియు సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన సిద్ధాంతాలను రూపకల్పన చేసారని , వారు చేసిన కృషిని గుర్తించి భారతప్రభుత్వం 1957లో పద్మశ్రీ బిరుదుతో సత్కరించిందని, విద్యార్థులు మరియు పరిశోధకులు అందుబాటులో ఉన్న సమాచారాన్ని మరియు విజ్ఞానాన్ని సరైన రీతిలో ఉపయోగించుకొని అత్యున్నత స్థానాల్లో ఉండటమే ఎస్.ఆర్.రంగనాథన్ కు ఘనమైన నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సిబ్బంది డా.తెర్లి సింహాచలం, విజయ కుమార్, సతీష్, దుర్గా ప్రసాద్, సూర్య కుమారి మరియు విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు

# ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ర్యాలీ




కాకినాడ అచ్చంపేట జంక్షన్ లో గల ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాలతో విద్యార్థులు బోధన సిబ్బంది అచ్చంపేట జంక్షన్ వరకు ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించే విధంగా నిర్వహించిన మానవహారం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ మన జాతీయ పతాకం గౌరవప్రదమైన విలువలతో పింగళి వెంకయ్యగారు అభివృద్ధి చేశారని తెలిపారు. దీనిలోని కాషాయం త్యాగానికి వీరత్వానికి ప్రతీక అయితే తెలుపు శాంతికి చిహ్నమని మరియు పచ్చదనం పాడిపంటలకు చిహ్నంగా సూచిస్తుందని అన్నారు. నేడు విద్యార్థులు భవిష్యత్తులో శ్రమ, కృషి, కొత్త ఆవిష్కరణలతో భారతదేశాన్ని ముందుకు నడిపించాలని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డా.ఎం. పోచయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు మధు కుమార్, శ్రీనివాస్, పిడి సత్యనారాయణ, విజయ , మనోజ్, శ్రీదేవీ అప్పారావు, స్రవంతి, శ్రీనివాసరావు బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచిమాట



*జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కి సంపన్నుల జాబితాలో స్థానం సంపాదించిన తర్వాత కూడా పేదల పట్ల కృతజ్ఞతతోనే వ్యవహరించాలి. సామాన్యుడికి కష్టం లేనిదే ఏ సంపన్నుడు ఆ స్థాయికి చేరుకోలేడు.*

*- మహాత్మా గాంధీ*

# నన్నయలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు










(మొదటి పేజీ నుంచి)
జగన్నాథరావు హాజరై జాతీయ జెండాను ఎగురవేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని అందించారు. వీసీ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. 75వ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న భారతదేశం సాధించిన అభివృద్ధి ఘట్టాలను గుర్తుచేసారు. ప్రపంచ దేశాలలో భారతదేశానికి ప్రత్యేక స్థానం ఉందని, బాబాసాహేబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించే గొప్ప దేశమని అన్నారు. గౌరవనీయులైన రాష్ట్రపతి తన ప్రసంగంలో భారతదేశం ప్రపంచం చూసే అద్భుతమని వ్యాఖ్యానించారని చెప్పారు. క్రీడలలో మనం సాధించిన విశేషమైన విజయాలు, ముఖ్యంగా టోక్యో ఒలింపిక్స్, అంతరిక్షం, చంద్రయాన్ మరియు మంగళయాన్ మొదలైనవి నిదర్శనమన్నారు. భారతదేశం తయారు చేసిన కోవిడ్ కోసం వ్యాక్సిన్ దేశ ఔషధ పరిజ్ఞానానికి ప్రతీక అన్నారు. నూతన జాతీయ విద్యావిధానం 2020 ద్వారా అనేక కొత్త కార్యక్రమాలను ప్రవేశపెట్టడంతో, విద్యా సంబంధ భాగస్వామ్యం క్రమంగా మెరుగుపడిందన్నారు. మన గ్రాడ్యుయేషన్ రేటు 86.11 శాతంగా ఉందన్నారు. ఉన్నత విద్యా సంస్థల నుండి సాయుధ దళాలకు, ప్రయోగశాలల నుండి ఆట స్థలాలకు మరింత మంది బాలికలు పురోగతిని కొనసాగించాలని ఆశిస్తున్నామన్నారు. మునుపెన్నడూ లేనంతగా నేడు, అట్టడుగు వర్గాలకు చెందిన భారతీయులు పక్షపాతం మరియు వివక్షకు భయపడకుండా ప్రధాన స్రవంతి సమాజంలోకి ప్రవేశిస్తున్నారన్నారు. రాబోయే కొద్ది సంవత్సరాలలో భారతదేశం మరింత బలంగా ఉద్భవించేలా మరియు పెరుగుతున్న శ్రామిక శక్తి ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్థిక సంస్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. 2021-22లో భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగిందన్నారు. ఆర్థిక వ్యవస్థ %వి%10.22 ట్రిలియన్ల వద్ద ఉంది, ఇది 2021లో జపాన్ కంటే దాదాపు రెండింతలు ఎక్కువని, ఇది రాబోయే సంవత్సరాల్లో చైనాను అధిగమించి రెండవ స్థానానికి చేరుకుంటుందని ఆకాంక్షించారు. యువతరం మేధాశక్తిని ఉపయోగించి సంస్థలను నెలకొల్పాలని, ఉద్యోగాలను క్రియేట్ చేయాలని సూచించారు. ఈ క్రమంలో మన విశ్వవిద్యాలయ అభివృద్ధిలో మనం ప్రగతిని సాధించామని కోవిడ్ అడ్డంకులు ఉన్న వందకు పైగా వెబినార్లు నిర్వహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నామన్నారు. ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులు తీసుకువచ్చామన్నారు. త్వరలో నాక్ గుర్తింపు నన్నయ విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చి మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. దేశాభివృద్ధి, విశ్వవిద్యాలయ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి 75వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. తరువాత విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మరియు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలలో భాగంగా విశ్వవిద్యాలయం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసారు. ఇటీవల ఉమెన్ వెయిట్ లిఫింగ్, ఉమెన్ క్రికెట్ లో సత్తాచాటిని విద్యార్థులను వీసీ అభినందించి చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందించండి

**13.08.22 (మీడియాసెల్)**

రెండవ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లకు అవకాశాలు అందించాలని, సమర్థవంతంగా ఇంటర్న్‌షిప్ నిర్వహించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలియజేసారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లకు సంబంధించి శనివారం అన్ని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ తో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో వీసీ పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ డొమైన్‌కు సంబంధించిన డిగ్రీ రెండవ సంవత్సరం విద్యార్థులందరూ ఎల్.ఎం.ఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. అలాగే వారు పోర్టల్‌లో అందించిన ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవాలన్నారు. దాదాపు 20,000 మంది విద్యార్థులను పోర్టల్‌లో అందించిన ఇంటర్న్‌షిప్ కోసం నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం నాటికి పూర్తి చేసే విధంగా ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే విశ్వవిద్యాలయ అధికారులనం సంప్రదించాలన్నారు. ఈ నెల 18వ తేదీలోగా, కళాశాలలు తమ కళాశాలలకు సమీపంలో అందుబాటులో ఉన్న వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మార్కెటింగ్ సంస్థలు మొదలైన వాటిలో ఫిజికల్ ఇంటర్న్‌షిప్‌ల కోసం రిజిస్ట్రేషన్‌ను కూడా పూర్తి చేయాలన్నారు. ప్రిన్సిపాల్స్ వ్యక్తిగత ఆసక్తిని తీసుకొని కంప్యూటర్ డొమైన్ కాకుండా ఇతర రెండవ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేయాలన్నారు. మన జిల్లాలన్నింటిలో పరిశ్రమల జాబితా ఇంతకు ముందు అందించబడిందని, ఎవరికైనా మళ్లీ జాబితా కావాలంటే విశ్వవిద్యాలయ అధికారులను సంప్రదించాలన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ బాడీ అన్ని కళాశాలలను చైతన్యపరచాలని మరియు అవసరమైతే వారికి సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారన్నారు.



ఆన్లైన్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in